క్లుప్తంగా

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఈ-సిటీ శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి 26 వరకు ధ్వజస్తంభ మరియు నూతన పంచలోహ విగ్రహాల పునః ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులు శేషం జగనాథాచార్యులు, శ్రీనివాసచార్యులు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపు



దేవతామూర్తులను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు

కందుకూరు: మండలంలో పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామం నుంచి దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులను ఊరేగించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు దేవాలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహాగణపతి, నవగ్రహ లక్ష్మీసుదర్శన హోమం నిర్వహించారు. శనివారం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మొకరాల భాస్కర్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, గ్రామ పెద్దలు బుక్క పాండురంగారెడ్డి, మంగలి మల్లయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్‌గౌడ్, పాండుగౌడ్, రమేశ్, నరేందర్‌రెడ్డి, రవీందర్, నారాయణ, మహేందర్‌రెడ్డి, వత్తుల శ్రీనివాస్, జల పాండు, హరి, భిక్షపతి పాల్గొన్నారు.

లాస్య నందిత కుటుంబ సభ్యులకు తీగల పరామర్శ

దిల్‌సుఖ్‌నగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ శాసనసభ్యులు లాస్య నందిత కుటుంబ సభ్యులను శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పరామర్శించారు. సికింద్రాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయలధరలు (కిలో ...రూపాయల్లో..) టమోటా లోకల్ 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 28, క్యారెట్ 19. దొండ 42, ఆలు 25, ఉల్లి 19, గోకర 45, దోస 20, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 58, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 57. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ నుంచి వినాయక స్టీల్ కూడలి వరకు జాతీయ రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు జే సుదర్శన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తరించిన ఈ రోడ్డుపై నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయని తెలిపారు. దీంతో జాతీయ రహదారి నుంచి ఆయా కూడళ్లకు వాహనాలు మలుపు తిప్పే క్రమంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఎన్‌హెచ్‌ఏఐతో పాటు పలు శాఖల అధికారులకు సమస్య విన్నవించినా ఫలితం లేదన్నారు. గతేడాది వై జంక్షన్ నుంచి పెంజర్ల కూడలి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేసినా ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాడ్గుల: మాడ్గుల మండలం అందుగులలో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ పద్మారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అందుగుల గ్రామానికి రూ.10లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. అలాగే అందుగుల గ్రామ పరిధిలోని అంతంపేట రూ.5లక్షలు, కుభ్యతండాకి రూ.10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు రమేష్, శ్రీను, పర్వతాలు, అందుగుల రాజు, వెంకటయ్య, పెంటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం

- ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యం
- నిత్యం రెండున్నర గంటల పాటు ప్రత్యేక తరగతులు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు శిక్షణ
- ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ర్యాంకుల సాధనే ధ్యేయం



మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహేశ్వరం: 'పదోతరగతి' విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్‌ను దశ, దిశ నిర్దేశం జరిగేది ఇక్కడే. ఇక్కడ ప్రతిభ కనబర్చితే భవిష్యత్‌కు బంగారు బాట పడుతుంది. కానీ వారు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టపడి చదవాల్సిందే. దీనికోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో..

మహేశ్వరం మండలంలో మొత్తం 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ సంవత్సరం 1032 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది

విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది పదోతరగతి. గతంలో 'పది' పరీక్షలకు 11 పేపర్లు ఉండగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం 7 పేపర్లకు కుదించింది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి మాత్రమే గంటన్నర చొప్పున ఆయా సబ్జెక్టులకు 3 గంటల సమయాన్ని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

తరగతులు ఇలా..

ప్రతీరోజు ఉదయం 8:30 నుంచి 9:30 గంటల పాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సాయంత్రం 4:30 నుంచి 6గంటల వరకు రోజు మొత్తం రెండున్నర గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి

ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది 'పది'కి పది మార్కులు ఎవరు సాధిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలతో తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు.

"తర్ఫీదు ఇస్తున్నారు



ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తర్ఫీదు ఇస్తున్నారు. అవసరం ఉన్న వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

– పి సాయి చరిత, పదోతరగతి, మోడల్ స్కూల్, మహేశ్వరం

'పది' జీపీఏ సాధిస్తా



మంచి మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నా. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. పాఠాల్లోని సందేహాలను స్టడి అవర్స్‌లో నివృత్తిచేసుకుంటున్నాం. పది పరీక్షల్లో కష్టపడి చదివి 'పది' జీపీఏ సాధిస్తా.

– బి నందిని, పదోతరగతి

ప్రతీ విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ



ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకె వెళ్తున్నాం. ప్రతిరోజూ సబ్జెక్టుల వారీగా టెస్టులు నిర్వహించి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణతతో పాటు 10 జీపీఏలు ఎక్కువ మంది సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం.

– బి ధనుంజయ్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

అండగా ఉంటా

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చర్లగూడ గ్రామానికి చెందిన కొత్తమాల సత్తయ్య(40) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ శుక్రవారం చర్లగూడ గ్రామాన్ని సందర్శించి మృతుని భార్య లక్ష్మికి రూ.10వేల సాయం చేశారు. అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కిందివనం సత్యం భార్య లతను పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పూజిత, పుష్పమ్మ, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాంచందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిగూడ గ్రామంలో..

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూర మోని కిష్టమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా కుటుంబ సభ్యులకు దశదిన కర్మలకు రూ.10వేలను పంపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, నర్సింలు, రవీందర్, యాదయ్య, పర్వతాలు, శివానంద్, బాలరాజ్, రాఘవేందర్, నాగరాజు, బాలరాజ్, వీరేశ్, కుమార్ పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో చర్మ వ్యాధులు!



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ మంద జ్యోతి

- ఆకస్మిక తనిఖీ
- పట్టించుకోని నిర్వాహకులు, అధికారులు
- సత్వరమే వైద్యసేవలు కల్పించాలి
- నిర్వాహకులను నిలదీసిన ఎంపీపీ మంద జ్యోతి



బీసీ గురుకులం



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ

కందుకూరు: బైరాగిగూడ పరిధిలోని నిషితా ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ బీసీ వెల్ఫేర్ గురుకులలో పాఠశాల, కళాశాల విద్యార్థులు చర్మ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కందుకూరు, చాంద్రాయణగుట్ట గురుకుల పాఠశాలలతో పాటు చాంద్రాయణగుట్ట, కార్వాన్, రాజేంద్రనగర్‌కు చెందిన ఇంటర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. అక్కడ సుమారు 1,060 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో ఇక్కడ చర్మవ్యాధులు సోకడంతో చాలా మంది ఇళ్లకు వెళ్లి చికిత్సలు చేయించుకుని తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యను అడిగితెలుసుకున్నారు. సుమారు 200నుంచి 300మందికి గజ్జి, తామర వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వారు గుర్తించారు. భోజనశాల, మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసి నిర్వాహకుల్ని నిలదీశారు. విద్యార్థులకు చర్మ సమస్యలు వ్యాపిస్తుంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయించి చికిత్సలు అందించేలా చూస్తానని ఎంపీపీ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ గురుకులాలు, విద్యా సంస్థల్లో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేదిలేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట మండల నోడల్ అధికారి నర్సింహా పాల్గొన్నారు.

భయాన్ని వీడి.. ధైర్యంగా ఉండండి

షీ టీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: బాలికలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలని షీ టీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి సూచించారు. సైబరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు శుక్రవారం కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో షీ టీం బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. చదువుకునే దశలో వివాహాలు చేసుకొని తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. జీవితంలో అనుకున్నది సాధించి తమ కాళ్లపై తాము నిలబడినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు రద్దీ ప్రాంతాలలో అమ్మాయిలపై ఆకతాయిల వేధింపులు అధికంగా ఉంటాయని, వాటిని పసిగట్టి అలాంటి వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం చేరవేయాలన్నారు. విద్యార్థినులు ప్రేమ పేరుతో మోస పోకుండా విద్యపైనే ఏకాగ్రతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిచ్చయ్య, సిబ్బంది ప్రహ్లాద్, డెబోరా మాక్సిన్, వైస్ ప్రిన్సిపాల్ రమ్యభార్గవి, అధ్యాపకులు శిరీష, శారద, జయలక్ష్మి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్లపై అదనపు వసూలు

- చర్యలు తీసుకోవాలని వేడుకోలు
- ఆర్థికంగా నష్టపోతున్న పేదలు



కొనుగోలు చేసిన స్టాంప్ పేపర్లను చూపుతున్న అంజయ్య

కందుకూరు: మహేశ్వరంలో స్టాంప్ పేపర్లను అసలు ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారుల ఫోరం మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి తాళ్ల అంజయ్య వాపోయారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు స్టాంప్ వెండర్ల వద్ద తను స్టాంప్ పేపర్లను కొనుగోలు చేశారన్నారు. అక్కడ రూ.20ల స్టాంప్ పేపరు రూ.40లకు, రూ.100లది రూ.130ల చొప్పున విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సదరు అమ్మకం దారుని ప్రశ్నిస్తే ఇదంతా మామూలేనని బదులిచ్చినట్లు ఆయన చెప్పాడు. ఈ విషయంలో పేదలు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనంగా విక్రయించే స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడుతూ కూలిపోయే దశకు చేరింది. ఎప్పుడు ఏం జరుగుతుందో అక్కడ భక్తులు భయాందోళన చెందుతున్నారు. దర్గా దర్శనం అనంతరం ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. భారీ ఈదురుగాలులు, వర్షాలు కురిసినా ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో పలుమార్లు ట్యాంకును కూల్చివేయాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దర్గా ఆవరణలో ప్రమాదకరంగా మారిన ట్యాంకును కూల్చి నూతన ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బదిలీ సర్వ సాధారణమే

నందిగామ: నందిగామ మండలంలో గత కొన్నేళ్లుగా ఎంపీడీఓగా బాల్‌రెడ్డి చేసిన పనులు ప్రశంసనీయమని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న బాల్‌రెడ్డికి శుక్రవారం ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ మాట్లాడుతూ నందిగామ మండల కేంద్రంగా ఏర్పాటైనప్పటినుంచి ఎంపీడీఓగా అతను తన విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించి, అందరి మన్ననలు పొందారని గుర్తు చేశాడు. విధి నిర్వహణలో బదిలీ సాధారణమే ఐనప్పటికీ తమకు బాధగా ఉందని ఈట గణేశ్ అన్నారు. అనంతరం ఎంపీపీ ప్రియాంక మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో ఉంటూ, ప్రభుత్వం సూచించిన విధులను ఎప్పటికప్పుడు పూర్తి చేశారన్నారు. బాల్ రెడ్డి సార్ సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం బాల్‌రెడ్డిని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ సుమతి, ఎంపీటీసీలు కుమార్ గౌడ్, కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, జేకే నర్సింహా, చిందం నర్సింహా పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



నందనవనం కాలనీలోని శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని నందనవనం కాలనీ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడతామని, నందనవనం శ్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు!

- నిరుపయోగంగా ఎంపీడీఓ నూతన కార్యాలయం
- కొత్త భవనంలో కనిపించని ఫర్నిచర్
- బాత్‌రూముల్లో నీటి వసతి కరువు
- పాత భవనంలోనే కార్యకలాపాలు కొనసాగింపు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం

చేవెళ్ల: ఎంపీడీఓ నూతన కార్యాలయం ప్రారంభించారు. కానీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోకుండా పాతకార్యాలయంలోనే విధులు కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పేరుకే కొత్తభవనం అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవటంతో నిరుపయోగంగా మారింది. ఇది చేవెళ్లలో ఇటీవలే ప్రారంభించిన ఎంపీడీఓ నూతనకార్యాలయ భవనం పరిస్థితి. మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలోనే ఖాళీ స్థలంలో కొత్త భవనం నిర్మించారు. ఎన్నో ఏళ్ల తరబడి దీని నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. చివరకు నాలుగు నెలల కిత్రం మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వస్తుందని హడావిడిగా ప్రారంభించారు. నీటి వసతి కోసం ట్యాంకు ఏర్పాటు చేయలేదు. బాత్‌రూములకు సంబంధించిన పైపులైన్లు వేయలేదు. సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అధికారులు కొత్త భవనంలోకి వెళ్లేందుకు వెనుకాడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే అసంపూర్తిగా భవనం

ఈ భవన నిర్మాణ పనులు మొదలైనప్పటినుంచి కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపించినా వారిని ఏమి చేయలేని దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ పనితీరుతో విసుగు చెందిన ఉన్నతాధికారులు టెండర్ రద్దు చేసినా మళ్లీ అతడే పూర్తి చేయిస్తానని ఒప్పించి టెండర్ దక్కించుకొని ఏళ్లతరబడిగా పనులు చేయించాడు.

కనీస వసతుల కల్పనకు కృషి



భూపేశ్‌గుప్తానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోర్ వేయిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 'మీకోసం మేమున్నాం' స్వచ్ఛంద సంస్థ చైర్మన్, భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భూపేశ్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎంవీ ఫౌండేషన్ సంస్థ ద్వారా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనిచ్చి వారిని ప్రోత్సహించాలని, ప్రభుత్వ స్కూళ్లలో కనీస వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ సభ్యులు వెంకటస్వామి, సువర్ణ, కాలనీ వాసులు నీరుడు వెంకటేశ్ ముదిరాజ్, జాల శివకుమార్ యాదవ్, జాల శ్రీనివాస్‌యాదవ్, కందికంటి భరత్‌గౌడ్, కందకట్ల శికుమార్‌రెడ్డి, కె.రాజు, కట్ట మురళి తదితరులు పాల్గొన్నారు.